# ప్రేమో..రత్నాంబ!

మునిపల్లె లక్ష్మీరమణకుమారి

''వచ్చేనెలలో మా అబ్బాయి ఇండియాకి వస్తున్నాడు. ఏవో సంబంధాలు ఉన్నాయన్నావుగా, రెడీగా ఉండమను'' సుజనని అడిగింది రత్నాంబ.

''ఎట్లాంటి పిల్ల కావాలి? నాకు వివరంగా చెపితే సూటబుల్‌గా ఉన్నవాళ్ళకి చెపుతాను.''

''అమ్మాయి బాగుండాలి. బాగా చదువుకుని ఉండాలి. బాగా డబ్బున్న కుటుంబం అయి ఉండాలి. పెళ్ళి బాగా చెయ్యాలి'' వరసగా చెప్పుకుపోతోంది రత్నాంబ.

''సరే, ఇవన్నీ ప్రతి మగపిల్లాడి తల్లీ కోరుకునేవే. చూస్తాలే'' అంది సుజన.

సుజనా, రత్నాంబా ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. సుజన పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షలు పాసయ్యి, ఈ ఉద్యోగంలో ప్రవేశించిన ఐదేళ్ళకి రత్నాంబ ఈ ఉద్యోగంలో చేరింది. రత్నాంబ మొగుడు ఇదే ఆఫీసులో పని చేస్తూ, సర్వీసులో ఉండగా పరమపదించాడు. కంపాషనేట్ గ్రౌండ్స్ మీద చేరిన రత్నాంబకి ఈ ఆఫీసులో చేరకముందే, ఆఫీసు పుట్టుపూర్వోత్తరాలు తెలుసు. ఆయన ఇదే ఆఫీసులో పనిచెయ్యడంవల్ల, గవర్నమెంటు ఆఫీసులో పని చెయ్యకపోయినా కొంపలేం మునగవని తెలుసు. రోజూ పన్నెండు గంటలకి ఆఫీసుకి రావడం, ఒంటి గంటకి లంచ్‌కి పోవడం, రెండున్నర లేక మూడు గంటలప్పుడు మళ్ళీ రావడం, నాలుగు లోపల ఇంటికి చెక్కెయ్యడం, తనది కంపాషనేట్ పోస్టింగ్ కాబట్టి పని చెప్పకుండా, జీతం మాత్రం ఇచ్చేయాలనే అభిప్రాయంతో, పని చెయ్యకపోగా ఆఫీసర్లతో పోట్లాడటం.. ఇవన్నీ చూసి ఆఫీసర్లకి భయం పట్టుకుంది. ఏమన్నా అంటే అరిచి పోట్లాడుతుంది. ఏమనలేక, ఏం చెయ్యలేక, చివరికి వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి, ఆడవాళ్ళని ఆడవాళ్ళే నోర్మూయించగలరనే ఉద్దేశంతో ఇద్దరు ఆడ ఆఫీసర్ల కింద వేసేశారు. అంటే సెక్షనాఫీసరూ, పెద్దాఫీసరూ కూడా ఆడవాళ్ళే. అదికూడా అట్లాంటి, ఇట్లాంటి, నారీమణులు కాకుండా ఎందరినో హడలగొట్టిన మహిళా శిరోమణులయిన మహేశ్వరి, నూకాంబికల కింద పని చెయ్యమని వేశారు.

మహేశ్వరి, నూకాంబికలకు చాలా గొప్ప చరిత్ర ఉంది. వాళ్ళదగ్గర పని చెయ్యటమంటే జనం హడలిపోతారు. కానీ రత్నాంబ మాత్రం జంకూ గొంకూ లేకుండా తాపీగా ఆ సెక్షన్లో ప్రవేశించింది. పని చేసేవాడికి ఏ సెక్షనైతే ఏంటి? పని చెయ్యనివాడి విషయంలోనూ అంతేమరి.

నూకాంబిక, మహేశ్వరిల స్ట్రిక్టు పప్పులు రత్నాంబ దగ్గర మాత్రం ఉడకలేదు. వాళ్ళ సెంటిమెంట్ మీద గట్టి దెబ్బకొట్టింది రత్నాంబ.

''మీకేమమ్మా, హాయిగా బయటపన్లు చేసేందుకూ, ఇంట్లో సాయం చేసేందుకూ మొగుడు ఉన్నాడు. ఆ మహరాజే ఉంటే నాకిలా ఈ ఆఫీసులో చేరాల్సిన గతి పట్టేదేకాదు. బతుకంటే చక్కగా పోకు చేసుకుని, తలనిండా పువ్వులు పెట్టుకుని కూర్చోవటంకాదు. ఎవడి మొగుడు ఎప్పుడు పోతాడో ఎవడికి తెలుసు. కాస్త సానుభూతి ఉండాలి'' అంటూ అరిచేసరికి నూకాంబికా, మహేశ్వరీ ఇద్దరూ సైలెంటైపోయారు.

''ఏదో లేట్‌గా రావటం, తొందరగా పోవటం లాంటి కన్సెషన్లు తీసుకో. మరీ అస్సలు పని చెయ్యకపోతే ఎలా?'' అంటూ గొణిగారు.

రత్నాంబ తొణకలేదు.

''సెక్షన్లో బోల్డుమందున్నారు. ఊరికే తిని తిరగటం, కండలు పెంచటం తప్ప ఎవడికి మాత్రం చేతినిండా పనుందని? తలా ఒక పనీ అప్పజెప్పేస్తే నాసీట్లో ఉన్న నెలరోజులపని నిమిషాలమీద పూర్తయిపోతుంది.'' అని ఆఫీసర్ల సమర్ధత పని చేయించటంలోకాక, ఎలాగోలా పని పూర్తి కానిచ్చుకోవటంలో ఉందన్న మానేజేరియల్ ఎఫిషియన్సీనీ, సూపర్‌వైజరీ క్వాలిటీనీ నొక్కి చెప్పింది.

ఇక తప్పదని నూకాంబికా, మహేశ్వరీ రాజీ పడిపోయారు. రత్నాంబతో పని చేయించుకోలే... శుభ్రంగా ఆవిడ్ని వదిలించుకోవటం మేలని... ప్పుడు కాకుండా ఇంకో సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ చే... ద్దామని ప్రయత్నించారు.

''ఆవిడ్ని ఎవరూ తీసుకోమంటున్నారు. మీరే ...చాలి, తప్పదు. గవర్నమెంటు సొమ్ము ఎంతో... కోట్లకు కోట్లు ఊరికే తింటున్నారు. ఈవిడకి ఇచ్చే... నెలకు పదివేలు కూడా ఉండదు. పోనీండి. ఆవిడ్ని... మార్చమని మాత్రం మాదగ్గరకు రాకండి. ఆవిడ్ని... శాశ్వతంగా మీ సెక్షన్లో పోస్ట్... కాదు కాదు పే... చేస్తున్నాం'' అని తెగేసి చెప్పారు పోస్టింగ్ సెక్షన్ వాళ్ళు.

నోరుమూసుకుని తిరిగి వచ్చారు మహేశ్వరీ, నూకాంబికా. ఆవిధంగా విజయవంతంగా తన జైత్రయాత్రని కొనసాగిస్తోంది రత్నాంబ.

అన్నిచోట్లా అదే వైఖరి. బస్సులో మనుషులు కూర్చోబోతుంటే, తోసిపారేసి తను కూర్చోవటం, సినిమా క్యూలో మధ్యలో దూరి టిక్కెట్లు తీసుకోవడం, డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో కాపీలు కొట్టటం, ఒకటేమిటి, ప్రతిచోటా, ప్రతిక్షణం, తన విజయదుందుభి మోగిస్తూనే ఉంది.

రత్నాంబకి ఇద్దరు పిల్లలు. ఒక కొడుకూ, ఒక కూతురూ. భర్త పోయేనాటికి పిల్లలిద్దరూ తొమ్మిదో క్లాసు, పదోక్లాసు చదువుతున్నారు.

ఒకరోజు రత్నాంబ ఉన్నట్లుండి సుజనని చూసి, ప్రేమగా నవ్వింది.

ఎందుకోనని భయం వేసింది సుజనకి.

''సుజనా, నాకు కాస్త తోడు వస్తావా?'' అడిగింది రత్నాంబ.

లంచ్ అయ్యాక ఇద్దరూ బయల్దేరారు.

రత్నాంబ తీసుకెళ్ళినచోటు 'మంగళం మహత్ కళ్యాణ వేదిక'. అది మంచి బిల్డింగ్‌లో మూడో అంతస్థులో ఉంది. అక్కడ రత్నాంబ తన పేరు రిజిష్టర్ చేయించింది.

''ఎలాంటి వరుడు కావాలి?'' అడిగింది ఆ ఆఫీసు నిర్వహిస్తున్న మంగళాంబ.

''మనిషి బాగుండాలి. మంచి ఉద్యోగం ఉండాలి. బాగా డబ్బుండాలి. నా డబ్బు ఆశ పడనివాడై ఉండాలి. నన్ను ప్రేమగా చూసుకోవాలి'' అంటూ చదివేసింది రత్నాంబ. ఇట్లాంటివారినెందరినో చూసిన అనుభవం మంగళాంబది.

''నీకేనా పెళ్ళి?'' అడిగింది.

''అవును.''

''నీక్కావల్సిన సంబంధం దొరకదు'' ఖచ్చితంగా చెప్పింది మంగళాంబ.

''ఏం?''

''ఎంత ముసలాడైనా అందమైన పిల్ల కావాలనుకుంటాడు. నీకా ఎత్తుపళ్ళు, నల్లటి నలుపు, వికారంగా ఉన్నావు. ఇద్దరు పిల్లలు. ఇన్ని కోరికలకు తగ్గవాడు ఉండడు. ఇవన్నీ అడిగితే వచ్చే పెళ్ళికొడుకు కూడా వెనక్కుపోతాడు. నీకిష్టమైతే ఇద్దరు పిల్లలున్న పెళ్ళికొడుకున్నాడు. నలభై అయిదేళ్ళు. ఏదో

నీలాంటి ఉద్యోగమే చేస్తున్నాడు. గంతకు తగ్గ బొంతని కోరుకోవాలిగానీ, గొంతెమ్మ కోరికలుంటే ఎలా?'' అంటూ నిర్మొహమాటంగా చెప్పింది మంగళాంబ.

''పెడీసినట్టుంది. ఇప్పుడు పెళ్ళి చేసుకునేది ఎవడి పిల్లల్నో చూసుకోవటానికా?''

''ఏమో. నీ ఇష్టం. నేను ఉన్నమాట చెప్తాను. వివరాలు ఇచ్చివెళ్ళు. ఆపైన దేవుడి దయ.'' అంది మంగళాంబ. ఆ తర్వాత రత్నాంబ కోరికలకు తగ్గ సంబంధం దొరకనేలేదు. చివరికి పునర్వివాహం అనే ఆలోచనకు స్వస్తి చెప్పింది రత్నాంబ.

''చేసుకుంటే రాజాలాంటి సంబంధాలు బోలెడన్ని ఉన్నాయి. మీగురించి నేను అన్నీ మానుకుని బతుకుతున్నాను'' అని సొంత పిల్లల్ని కూడా బుకాయించి, నమ్మించిన ఘన నారీమణి రత్నాంబ. వాళ్ళని అదరగొట్టీ, బెదరగొట్టీ, తన చెప్పుచేతల్లో ఉంచుకుని, తన కిష్టమైన రీతిలో పెంచి పెద్దచేసింది. ఆవిడ కబంధ హస్తాల్లోంచి ఎప్పుడు బయటపడతామో అని ఎదురుచూశారు వాళ్ళు.

కూతురుకి పెళ్ళి చేసింది. కొడుకు బి.టెక్ చదివాక అమెరికాకి వెళ్ళాడు. అక్కడ ఎం.ఎస్. చేశాక ఉద్యోగంలో చేరాడు. అతనికే ఇప్పుడు పెళ్ళి సంబంధాలు. ఫ్లాష్‌బ్యాక్‌లోంచి బయటపడింది సుజన.

సుజనకి తెలిసినవాళ్ళు కొందరు అమెరికా సంబంధం ఉంటే చెప్పమని అడిగినవాళ్ళకి రత్నాంబ అడ్రసు ఇచ్చింది.

అనుకోకుండా ఒకరోజు రత్నాంబ కొడుకు వచ్చేశాడు. పెళ్ళిచూపులు పీటలవెల్లో సాగాయి. రోజుకి పదిమంది అమ్మాయిల్ని చూసి ఉంటారు. అందరి చిట్టాలూ పెద్ద రిజిష్టర్‌లో ఎక్కించుకుని, రాత్రింబవళ్ళు ఆలోచించి, చివరికి ఒక సంబంధం సెటిల్ చేసింది.

పెళ్ళికూతురు రత్నాంబ దూరపు బంధువుల పిల్లే. రత్నాంబ గడుసుదనం వాళ్ళకి తెలుసు. అపర సూర్యకాంతం అని కూడా తెలుసు. అయినా పిల్లాడు ఉండేది అమెరికాలో.

ఫెళ్ళున పెళ్ళి జరిగిపోయింది. అమ్మాయివాళ్ళు రత్నాంబ అడిగినవన్నీ చేశారు. అమెరికా సంబంధం దొరుకుతోందన్న ఆనందంతో ముందూ వెనకా చూడకుండా బోలెడు ఖర్చుపెట్టారు.

అమ్మాయి అమెరికా వెళ్ళిపోయింది.

పిల్లా, పిల్లాడూ సుఖంగా ఉన్నారు.

ఒక ఆర్నెల్లాగి రత్నాంబ తనూ అమెరికాకి వెళ్ళివచ్చింది. అందరికీ తన ఫోటో ఆల్బమ్ ఆనందంగా చూపించింది. పదిరోజులు గడిచాయి.

ఒకరోజు ఆఫీసులో కూర్చుని ఏవో కాయితాలు రాస్తున్న రత్నాంబని చూసి ఆశ్చర్యపోయింది సుజన. అమెరికాకి వెళ్ళివచ్చాక రత్నాంబకి పని విలువ తెలిసి వచ్చిందేమో అని సంతోషపడింది.

''ఏంటి రాస్తున్నారు?'' అడిగింది.

''నా వాలంటరీ రిటైర్‌మెంట్ అప్లికేషన్.'' అంది రత్నాంబ.

''ఆ ..'' సుజన ఆశ్చర్యపోయింది. వాలంటరీ రిటైర్‌మెంట్ దేనికీ? ఆఫీసులో చేరగానే మెంటల్‌గా రిటైర్ అయిపోయిన మనుషుల్లో రత్నాంబకు ప్రథమ తాంబూలం దక్కుతుంది. ఇంక కోరుకుని రిటైర్ అవడం దేనికి? అయినా ఇంట్లో ఉంటే ఈ సుఖం ఎక్కడ ఉంటుంది. పైన ఫ్యానూ, వేసవిలో కూలరూ, నీడపట్టున జీవితం, వేళపట్టున భోజనం, టీ, టిఫినూ, ఇవన్నీ ఇంట్లో ఉంటే కుదరవని రత్నాంబ చెప్తూనే ఉంటుంది. ఇంటికన్నా గుడి పదిలం. మరింక కోరి రిటైర్‌కావటం దేనికీ?

ఉండబట్టలేక అడిగేసింది. ''ఎందుకండీ రిటైర్‌మెంటు?''

''అమెరికాకి వెళ్ళిపోతున్నానండీ'' బాంబు పేల్చింది రత్నాంబ.

''ఆ ..''

''అవునండీ. అక్కడ బోలెడు హాయిగా ఉంది. అక్కడే ఉంటాను. డిపెండెంట్ వీసా ఇస్తారుట. హాయిగా పోతాను.'' చల్లగా చెప్పింది రత్నాంబ.

సుజన నిర్ఘాంతపోయి చూస్తూ ఉండిపోయింది.

రత్నాంబ అమెరికాలో స్థిరపడుతుందంటే ఆ కొడుక్కి అసలు ఎవరూ పిల్లనిచ్చేవాళ్ళు కాదేమో! ఆమె గయ్యాళితనమూ, గడుసుదనమూ జగద్విదితం. పిల్లాడికి పెళ్ళయిందాకా అమెరికా మొహం కూడా చూడకుండా, జనాన్ని నమ్మించి, పెళ్ళికాగానే అమెరికా యాత్ర చేసి, వెంటనే అక్కడే స్థిరపడాలన్న ఊహలో ఇక్కడికి వచ్చి, అమ్మో రత్నాంబా అని నిర్ఘాంతపోయింది.

అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం చెయ్యటానికీ, జీతం తీసుకోవటానికీ తప్ప పెన్ను తీయని రత్నాంబ, అంతమంచి ఉద్యోగంలోని ఆనందాన్ని కూడా వదులుకుని వెళ్తోందంటే, ఆ అమెరికా సుఖమయ జీవనానికి జోహార్లు, అనుకుంది సుజన. కానీ- అసలు కథవేరు!

అమెరికాలో భార్యాభర్త ఇద్దరూ ఉద్యోగాల్లో చేరారు. ఇంటిపని, వంటపని చెయ్యడానికి పనిమనిషి దొరక్క- దొరికినా జీతం ఎక్కువ కాబట్టి, రత్నాంబని తీసుకుపోతున్నారువాళ్ళు. స్వర్గంనుండి నరకానికి వెళ్తున్న సంగతి రత్నాంబకి తెలియదుపాపం!

★

